క్లుప్తంగా

గర్భిణులు, బాలింతలకు అవగాహన



పెనుగంచిప్రోలు: సున్నా నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలు తక్కువ ఎత్తు, బరువు తక్కువ ఉంటే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషకాహారంతో పాటు అదనపు పోషకాహారం అందిస్తామని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్నారుల ఎత్తులు, బరువులు చూడటంతో పాటు అవసరమైన పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల, జయలక్ష్మీ, రాజ్యలక్ష్మీ, మంజుల, విమల, తదితరులు పాల్గొన్నారు.

25న చీరల వేలం

నందిగామ రూరల్: మండలంలోని లింగాలపాడు గ్రామంలో వేంచేసియున్న లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి చీరలకు బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో నరసింహమూర్తి పేర్కొన్నారు. స్థానిక ఆలయ ఆవరణలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న సాయంత్రం మూడు గంటలకు పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి వారి ఆలయ ఆవరణలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలకు వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కంచికచర్ల: రంగానగర్‌లో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు భూమిపూజ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కుర్రా వీరభద్రరావు మాట్లాడుతూ దాతల ఆర్థిక సహాయ సహకారంతో రూ. 25 లక్షలతో పనులు చేపట్టామని తెలిపారు. త్వరలోనే ఆలయ నిర్మాణం పూర్తిచేస్తామని అన్నారు. ముందుగా ఆలయ శంకుస్థాపన కోసం అర్చకులు ప్రసాదు నీరాజన మంత్ర పుష్పములు, అష్టోత్తర పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పలువురు భక్తులు విరాళాలు అందించినట్లు ఆలయ ఏసీ వరప్రసాద్ పేర్కొన్నారు. కోదాడకు చెందిన సాయిరుత్విక్ రూ. 25,116, సోమవరం గ్రామానికి చెందిన మంచికంటి జనార్దన్ రూ. 10,116 విరాళంగా అందించారని చెప్పారు. దాతలకు స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టపగలే వెలుగుతున్న వీధిలైట్లు



నందిగామరూరల్: ప్రభుత్వం విద్యుత్‌ను ఆదా చేయమని ప్రకటనలు చేస్తూ ప్రజలకు అవగాహన కలిగిస్తుంటే పాతబెల్లంకొండ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పట్టపగలు కూడా వీధి దీపాలు వెలుగుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

లారీని ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మూలపాడు(ఇబ్రహీంపట్నం): ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సేకరించిన సమాచారం ప్రకారం.. కంచికచర్ల మండలం బత్తినపాడు గ్రామానికి చెందిన చింతపల్లి రాజు (35) గ్రామస్తులతో కలిసి వేళంకిని మాత దర్శనం కోసం ఐదు రోజుల కిందట నాగపట్నం వెళ్లాడు. గతంలో భార్య చనిపోవడంతో తన 11 ఏళ్ల కుమార్తెను గొల్లపూడిలోని తన సోదరుని ఇంటి వద్ద వదిలి వెళ్లాడు. నాగపట్నం నుంచి ఆదివారం ఉదయం గ్రామానికి చేరుకున్న అనంతరం తన కుమార్తెను తీసుకు వచ్చేందుకు బైక్‌పై గొల్లపూడి బయలుదేరాడు. మూలపాడు వద్దకు చేరుకునేసరికి బైకు అదుపుతప్పి హైవే పక్కన ఆగి ఉన్న లారీని వెనక వైపు ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాజు తల, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



నందిగామ ఆర్‌సీఎం చర్చిలో క్రీస్తు సందేశాన్ని వినిపిస్తున్న ఫాదర్లు



నందిగామలో ఈస్టర్ పండుగ ప్రార్థనల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న క్రైస్తవులు



పేట ఆర్‌సీఎం చర్చిలో దివ్యబలి పూజ చేస్తున్న ఫాదర్ జయరాజు



పేట ఆర్‌సీఎం టౌన్ చర్చిలో పాస్కా జాగరణలో క్యాండిల్స్‌తో ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

పెనుగంచిప్రోలు: మండలంలోని వివిధ గ్రామాల్లోని చర్చిల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ముచ్చింతాలోని ప్రసిద్ధ లూర్థుమాత ఆలయంతో పాటు పెనుగంచిప్రోలులోని జెజీఎం చర్చి, షాలోమ్ చర్చి, తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

కంచికచర్ల: క్రీస్తు పునర్థానం(ఈస్టర్) పర్వదినం సందర్భంగా మండలంలోని పలు క్రైస్తవ దేవాలయాల్లో ఆదివారం విశ్వాసులు, భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక ఆర్సీఎం చర్చి ఫాదర్ రెవరెండ్ దత్తు మాట్లాడుతూ క్రీస్తు మానవాళి కోసం శుభ శుక్రవారం నాడు శిలువ మరణం పొంది మూడవ దినమైన ఆదివారం తిరిగి లేచాడని తెలిపారు. ఏసు అడుగుజాడల్లో ప్రతిక్కరూ నడుచుకోవాలని సూచించారు. మండలంలోని పలు క్రైస్తవ దేవాలయాల్లో క్రీస్తు పుట్టుక, మరణం తిరిగి పునుర్థానం గురించి పాస్టర్లు భక్తులకు వివరించారు. కార్యక్రమంలో క్రైస్తవులు, విశ్వాసులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని గండేపల్లి సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో 30 మంది విశ్వాసులుకు కీసర మున్నేరులో పాస్టర్ రెవరెండ్ కొండా స్టాలిన్ బాప్తిస్మము అందజేశారు. అనంతరం చర్చి ఆవరణలో 1000 మందికి ప్రేమ విందు చేశారు.

ఘనంగా ఈస్టర్ పండుగ..

నందిగామ రూరల్: ఈస్టర్ పండుగ ప్రతి విశ్వాసి జీవితానికి దిశా నిర్దేశం చేసే జీవన సందేశమని ఫాదర్‌లు విజయ్‌కుమార్, జోజిరెడ్డి తెలిపారు. ఈస్టర్ పండుగను ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఆర్‌సీఎం చర్చిలో ఈస్టర్ పండుగ సందర్భంగా శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఫాదర్‌లు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. మరణాన్ని జయించి మూడవ రోజున పునరుత్తానుడై రావటం ఆయనలోని దైవశక్తికి నిదర్శనమని తెలిపారు. జీవితంలో ఎలాంటి కష్టనష్టాలను ఎదుర్కొన్నా మృత్యువు చివరి మెట్టు కాదని పునరుజ్జీవం ఉంటుందనే నమ్మకాన్ని ఈస్టర్ పండుగ బోధిస్తుందని చెప్పారు. ఈస్టర్ పండుగ ప్రతి క్రైస్తవునికి దేవుని అపారమైన ప్రేమను, క్షమాపణను ధ్యానించటానికి చక్కని అవకాశమని వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని సీఎస్ఐ, సెవెంత్ డే, పెంతోకొస్తు, తదితర చర్చిలలో ఈస్టర్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

ఫాదర్ విజయ్‌కుమార్‌కు ఘన సత్కారం..

పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి ఫాదర్ విజయకుమార్ జన్మదినంతో పాటు ఫాదర్‌గా బాధ్యతలు చేపట్టిన దినం సందర్భంగా పలువురు భక్తులు ఆదివారం ఆయనను ఘనంగా సత్కరించారు. ముందుగా జన్మదిన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ తమపై ప్రేమాభిమానాలను చూపించటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మన్నెం దాసు, దత్తం, శామ్యేలు, సత్యంబాబు, ఆనంద్, అవినాష్, మేదరమెట్ల రామారావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు

వీరులపాడు: క్రీస్తు పునరుత్తాన పండుగ ఈస్టర్ పండుగను మండలంలోని ఆయా గ్రామాల్లో క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. చర్చిలు, నిత్య సహాయ మాత, పరిశుద్ధ లూర్థుమాత, తదితర ఆలయాల్లో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పొన్నవరం గ్రామంలోని గ్రేస్ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్‌లు గొర్రెపాటి రత్నం, ఇమ్మానియేలు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షోడగిరి రాజశ్రీ, సతీష్, పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు. బోడవాడ–జమ్మవరం విచారణ పరిధిలోని పరిశుద్ధ లూర్థుమాత దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెవ. ఫాదర్ సాలే వినయ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో యాదాల సుజాత, నన్నెబోయిన తిరుమలరావు, యాదాల దాసు, కర్ల రాణి, రాజు, తదితరులు పాల్గొన్నారు. జగన్నాధపురంలోని నిత్య సహాయ మాత ఆలయంలో రెవ. ఫాదర్ సుగుణరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండి విజయ్‌పాల్‌రెడ్డి, నాయకులు జ్ఞానారెడ్డి, నరసింహారెడ్డి, బాలస్వామి, పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని వెల్లంకి గ్రామంలోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో పాస్టర్ జేస్‌పాల్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు.

పేటలో ఘనంగా ఈస్టర్ వేడుకలు....

జగ్గయ్యపేట అర్బన్: ఈస్టర్ వేడుకలు ఆదివారం పట్టణంలోని పలు చర్చిల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక సెయింట్ థామస్ సీఎస్ఐ టౌన్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో డీనరీ చైర్మన్ రెవరెండ్ ఎస్.పాల్‌రాజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు చర్చిలకు వచ్చి ప్రార్థనల్లో పాల్గొనటమే కాకుండా భక్తి గీతాలు ఆలపించారు. ఒకరికొకరు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. డీకన్ రెవ కిరణ్, చర్చి కమిటీ ప్రతినిధులు, ఉమెన్స్ ఫెలోషిప్, సండేస్కూల్, యూత్, సంఘ సభ్యులు పాల్గొన్నారు. ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ గుడిసె జయరాజు ఆధ్వర్యంలో పాస్కా జాగరణ, దివ్యబలి పూజ నిర్వహించారు. ఖమ్మం డయోసిస్ ఫాదర్ దామాల సురేష్ పాల్గొన్నారు. ఫాదర్ జయరాజు ప్రసంగించారు. వైవై కాలనీలోని కాలేజ్ ఆఫ్ బైబిల్ టెక్నాలజీ (క్రైస్ట్ చర్చి)లో పాస్టర్ ఎ.విజయరావు ఆధ్వర్యంలో, కోదాడ రోడ్డులోని బేతెస్థ ప్రార్థనా మందిరంలో, బలుసుపాడు రోడ్డులో బేతేలు చర్చిలో బిషప్ జాన్ బాబు, విలియంపేట జి.జి.ఎఫ్ మినిస్ట్రీ చర్చిలో ఎస్.జోసఫ్‌కిరణ్ ఆధ్వర్యంలో, క్రిస్టియన్‌పేట, విలియంపేట సీఎస్ఐ చర్చిల్లో డీసీలు గంటా ఆనందరావు, దర్శన్‌సుందర్, సెయింట్ ఆన్స్ చర్చిలో సిస్టర్స్ ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలను వైభవంగా నిర్వహించారు.

బలుసుపాడు గ్రామంలో ఆర్‌సీఎం, సీఎస్ఐ, డీసీఎం, ఎల్లడ, సెవెంత్‌డే అడ్వాంటిస్ట్ తదితర చర్చిలలో ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సీఎస్ఐ చర్చిలో పాస్టర్ అభిలాష్, ఆర్‌సీఎం చర్చిలో ఉపదేశి అలోషియస్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు.



నందిగామ ఆర్‌సీఎం చర్చి ఆవరణలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఈస్టర్ సందర్భంగా పొన్నవరంలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు



వీరులపాడు మండలంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



పెనుగంచిప్రోలు జేజీఎం చర్చిలో ప్రార్థనలు



గండేపల్లి సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు, భక్తులు

సేవలు నిల్.. సర్వేలు ఫుల్

- ఆస్తి పన్ను వసూళ్లు, సర్వేలతో పాటు గ్రీవెన్స్ సమస్యలతో సతమతం
- లక్ష్యాలు పూర్తి కాకపోతే ఎంపీడీఓ చీవాట్లు, షోకాజ్ నోటీసులు
- పనిభారం తగ్గించాలంటూ కార్యదర్శుల గగ్గోలు



పని ఒత్తిడి తగ్గించాలంటూ జిల్లా పంచాయతీ అధికారి లావణ్యకుమారికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు (ఫైల్)

కంచికచర్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోజు రోజుకు పనిభారం పెరిగిపోవటంతో గ్రామ పంచాయతీల కార్యదర్శులు సతమతమవుతున్నారు. ఆస్తి పన్ను వసూళ్లు, ఇంటి పన్ను వసూళ్లు, సర్వేలు, రోజువారీ విధులు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి పనులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక సమీక్షల పేరుతో గంటల తరబడి జూమ్ మీటింగ్‌లు, తరచూ నిర్వహించే సమావేశాలతో, రోజు నిర్వహించే పనులు చతికిలపడుతున్నాయి. అధికారులు ఇచ్చిన లక్ష్యాలను చేరుకోకపోవటంతో నిత్యం ఏదో ఒక పంచాయతీ కార్యదర్శులకు మెమోలు అందుతున్నాయని సమాచారం. కంచికచర్ల మండలంలో ఓ గ్రామ పంచాయతీ కార్యదర్శికి వేతనాలు ఆపినట్లు సమాచారం. అదేవిధంగా వీరులపాడు మండలంలో సర్వేలు పూర్తిచేయలేదని షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు తెలిసింది.

సర్వేలతో ముప్పు తిప్పలు....

ఎన్టీఆర్ జిల్లాలో 288 గ్రామ పంచాయతీలు ఉండగా 220 మంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. నిత్యం పంచాయతీలకు వెళ్లి సంతకాలు చేసిన అనంతరం రోజు వారీ విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది. ఆస్తి పన్ను వసూలు చేయడానికి గతంలో బిల్ కలెక్టర్‌లు ఉండేవారు. ప్రస్తుతం ఆ విధులు కూడా పంచాయతీ కార్యదర్శులే నిర్వర్తిస్తున్నారు. నెలలో మొదటి రెండు మూడు రోజులు పింఛన్లును ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయాలి. మిగిలిన మొత్తాలను సెర్ప్‌కు పంపాల్సి ఉంటుంది. ప్రజలు అడిగిన పంచాయతీ పనులను తంచన్‌గా చేసి పెట్టాలి. లేదంటే వారి నుంచి వ్యతిరేకతను చవిచూడాల్సి వస్తుంది. సిటిజన్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయిస్ సర్వే, పీ 4 సర్వే, విలేజ్ సర్వేలను కార్యదర్శులకు అప్పగించారు. ట్యాంక్ క్లీనింగ్, క్లోరినేషన్, స్వర్ణాంధ్ర, కార్యక్రమాలు, డంపింగ్ యార్డుల నిర్వహణ, చెత్తతో సంపద తయారీ, నీటి సమస్యలు, రికార్డుల నిర్వహణ, సర్టిఫికెట్ల జారీ, సచివాలయ సిబ్బందితో పనులు చేయించటం, లీసు వసూళ్లు, వేలం పాటలు, పిల్లల మిస్సింగ్, ఆధార్ సర్వే, డెత్ రీ వెరిఫికేషన్ సర్వే తదితర సర్వేలతో ముప్పుతిప్పలు పడుతున్నారు.

పస్తులతో విధుల నిర్వహణ....

ప్రభుత్వ నిర్దేశిత సర్వేల కోసం సెలవు దినాల్లోనూ కార్యదర్శులు పనిచేయాల్సి వస్తుంది. లేదంటే నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తిచేయలేక అధికారులతో చీవాట్లు తినాల్సి వస్తుంది. సర్వే సమయంలో ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లో పనిచేసే కార్యదర్శులకు నెట్‌వర్క్ సమస్యతో ఒకే ఇంటి వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో సకాలంలో భోజనాలు కూడా చేయలేక పస్తులతోనే పూట గడపాల్సి వస్తుంది. ప్రతి సోమవారం మండల కార్యాలయాలతో పాటు కలెక్టరేట్‌లో అందే ఫిర్యాదులను పరిష్కరించడానికి క్షేత్ర స్థాయి పర్యటనలు తప్పనిసరిగా చేయాల్సి ఉంది. అక్కడ ఇరువర్గాల వాగ్వాదాలతో సమస్య జటిలమై మరింత ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. దీంతో పాటు కలెక్టరేట్‌కు ప్రతి సోమవారం అర్జీలు ఇచ్చేందుకు వచ్చే వారికి సేవలు చేయడానికి వారానికి కొందరు చొప్పున విధుల్లో పాల్గొనాల్సి వస్తోంది.

సర్దుకు పోండి....

గతంలో నాయకులకు, కార్యకర్తలకు, సిబ్బందిపై గౌరవం ఉండేది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పంచాయతీ కార్యదర్శులు విధులు అడకత్తెరలో పోకచెక్కలా మారాయి. సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్నా నాయకుల ఒత్తిళ్లతో అధికారుల చీవాట్లు తినాల్సి వస్తోంది. దీంతో పంచాయతీ కార్యదర్శుల సమస్యలను తొలి విడతలో ఆయా మండలాల ఎంపీడీఓల దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా జిల్లా పంచాయతీ పి.లావణ్యకుమారికి కూడా వినతి పత్రం అందజేశారు. దీంతో తామేమి చేయలేమని చేతులెత్తేయటంతో పాటు సర్దుకుపోవాలంటూ ఉచిత సలహాలు ఇస్తుండటం గమనార్హం. ఇటీవల నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణను కలసి పంచాయతీ కార్యదర్శులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. పని ఒత్తిడితో కుటుంబసభ్యులు పిల్లలతో సరదాగా గడపలేకపోతున్నట్లు వాపోయారు.

ముగిసిన అగ్ని మాపక వారోత్సవాలు



కంచికచర్ల: ఆసుపత్రుల్లో ఏదేని అగ్ని ప్రమాదం జరిగినప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఫైర్‌శాఖ అధికారి తలశిల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక అగ్నిమాపక కేంద్ర కార్యాలయం వద్ద వారోత్సవాలు ఆదివారం ముగిసాయి. ఈ మేరకు శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే సమీపంలోని అగ్నిమాపక కేంద్ర కార్యాలయం, లేదా పోలీసులు లేదా 101కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అగ్నిప్రమాదాలు ఆసుపత్రుల్లో జరిగిన సమయంలో అడ్మిషన్‌లో ఉన్న రోగులును, ఆరోగ్య సిబ్బందిని ఏ విధంగా బయటకు తీసుకురావాలో ప్రదర్శన చేశారు.

కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు కె.మధురిమ, ఫైర్ సిబ్బంది ఎం.శ్రీనివాసరావు, కె.ప్రవీణ్ కుమార్, కె.జయరాం, జి.శేఖర్‌బాబు, ఎం.అశోక్, షేక్ తాజుద్దీన్, సంజయ్‌వర్మ, జి.రాజశేఖర్, జీవీ నర్సయ్య, షేక్ సుబాని ఎస్.శ్రీనివాస్, జీవన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చల్లంగా చూడమ్మా తిరుపతమ్మ తల్లీ...



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. భక్తులతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిటకిటలాడాయి. వేకువ జాము నుంచే పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చల్లంగా చూడమ్మా తిరుపతమ్మ తల్లీ అంటూ వేడుకున్నారు. ఆలయం తరుపున భక్తులకు నిరంతరాయంగా మజ్జిగ పంపిణీ చేశారు. మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో భక్తులు సేద తీరారు.

–పెనుగంచిప్రోలు



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



ఆలయం బయట బోనాలతో భక్తులు

నేటి నుంచి వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

నందిగామరూరల్: మండలంలోని పల్లగిరి కొండపై వేంచేసియున్న కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను సోమవారం నుంచి అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఆధ్యక్షుడు కొత్త హనుమేశ్వరరావు శనివారం తెలిపారు. నాలుగురోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు 21వతేదీన విశ్వక్షేన పూజ, పుణ్యాహవచన, ఋత్విక్ వరణం, నవగ్రహ పూజ, అంకురారోహణ, అగ్నిప్రతిష్టాపన, వాస్తు పూజ, ధ్వజారోహణ, 22న సుప్రభాతసేవ, చందనాలంకరణ సేవ, శ్రీవారికి మూలవరులకు అష్టోత్తర కలశ స్నపన, 108కలశాలతో అభిషేకం అనంతరం స్వామి వారిని పెండ్లికుమారుడిగా చేయుట, రాత్రి ఏడు గంటలకు స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. 23న చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సహిత సుదర్శన హోమం, లక్ష్మీ నారాయణ కల్యాణం, 24న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, పూర్ణాహుతి పూజలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని చెప్పారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.